పల్లెకు చేరని వెలుగులు

- మారుమూల గ్రామాలకు లేని బస్సు సర్వీసులు
- రహదారి ఉన్నా పట్టింపులేని ఆర్టీసీ..
- మహాలక్ష్మికి దూరమవుతున్న మహిళలు, విద్యార్థినులు



బస్సు వేయాలని ఆర్టీసీ అధికారులకు వినతి



బస్సులేక ఆటోలో వెళ్తున్న మహిళలు

ఉండవెల్లి: 'అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది. మారుమూల గ్రామాల పరిస్థితి. ఉండవెల్లి, మానవపాడు, రాజోళి, ఇటిక్యాల మండలాల పరిధిలోని గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో, బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో కళాశాలలు, పాఠశాలలకు విద్యార్థులు సమయానికి రాలేక అష్టకష్టాలు పడుతున్నారు. ప్రజలు, విద్యార్థులు, ఆటోలలో వ్యయ, ప్రయాసాలతో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నడపాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉండవెల్లి మండలానికి పూర్తిగా బస్సుల రాకపోకలు లేవని, అలంపూర్ మండలంలో కేవలం అలంపూర్ మండల కేంద్రానికి మాత్రమే బస్సులు ప్రయాణిస్తున్నాయని, మిగితా మారుమూల ప్రాంతాలలో బస్సులు ప్రయాణించకపోవడంతో ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు. ఇలా వడ్డేపల్లి మీదుగా శాంతినగర్, అయిజ బస్సులు ప్రయాణించిన మా రుమూల ప్రాంతాలకు మాత్రం రావట్లేదని పేర్కొన్నారు. మానవపాడులో పలు గ్రామాలకు పోతుందని, మిగితా గ్రామాలకు నడవడం లేదని తెలిపారు.

విద్యార్థులు, మహిళల అవస్థలు..

పలు గ్రామాలకు పల్లెవెలుగు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆటోలలో ప్రయాణిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. తరగతులకు హాజరు కాలేకపోతున్నారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం మహిళలకు అందకుండా పోతుంది.

పట్టించుకోని అధికారులు..

ఉన్నతాధికారులు స్పందించి రహదారి సౌకర్యం ఉన్న గ్రామాలకు పల్లెవెలుగు బస్సు కల్పించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు పేర్కొన్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో మహిళల నుంచి విశేష స్పందన రావడంతో తమ గ్రామాలకు బస్సులు నడపాలని మహిళలు కోరుతున్నారు.

బస్సులు నడపాలి..



మా గ్రామానికి రోడ్డు మార్గం, ఆఫీసులకు అధిక సంఖ్యలో పనుల కోసం మహిళలు వస్తుంటారని వారికి బస్సు సౌకర్యం కల్పించాలి. రోడ్లు ఉన్నా బస్సులు లేవు. ఎక్కడికి పోవాలన్న ఆటోలకు వెళ్లాల్సిందే. ఇప్పటికైనా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయ్యాలని పేర్కొన్నారు.

– ఇందిరమ్మ, ఉండవెల్లి

వినతులను కలెక్టర్‌కు అందజేశాం

అన్ని మండలాల్లో రోడ్డు మార్గం ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని వచ్చిన వినతులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేశాం. సీఎం సమావేశంలో కలెక్టర్ తెలియజేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో ఏర్పాటు చేస్తాం.

– మంజులారెడ్డి, డిపో మేనేజర్

ఆదిశిలా క్షేత్రంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు, ఈఓ సత్యాచంద్రారెడ్డి, నాయకులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వంట షెడ్, టేకు తలుపులను ప్రారంభించి దాతలను సన్మానించారు. స్వామి వారి శేషవస్త్రంతో ఎమ్మెల్యేను సత్కరించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తిమ్మారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్ ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, బాబురావు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అలంపూర్: గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్య అధికారిణి ప్రసునరాణి అన్నారు. బుధవారం మండలంలోని గొందిమల్ల, బైరన్‌పల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలపై స్క్రీన్‌ప్లే ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్క్రీన్‌ప్లే ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను లఘు చిత్రాలతో ప్రదర్శించారు. టీబీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. టీబీ వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది, టీబీ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించినట్లు పేర్కొన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రతిభాస్ఫూర్తి, మండల ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మీకాంత్, ఆరోగ్య పర్యవేక్షకురాలు అక్కమ్మ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ శివకుమార్, హెల్త్ అసిస్టెంట్స్ బాలీశ్వరయ్య శెట్టి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతులతో మెరుస్తున్న చర్చిలు



విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న ఎంబీ చర్చి

ధరూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించారు. వారం రోజులుగా చర్చీలకు రంగులు వేసే పనులు చేపట్టారు. మండలంలోని ర్యాలంపాడు, మార్లబీడు, మన్నాపురం, సోంపురం, చిన్నపాడు, అల్లపాడు, కొత్తపాలెం, గుడ్డెందొడ్డి, నెట్టెంపాడు తదితర గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చి, హోసన్నా మందిరం, మరనాథ విశ్వాస సమాజ మందిరం, బాప్టిస్టు చర్చి, గుత్తి చర్చిలను అందంగా అలంగకరించారు. విద్యుత్ కాంతుల మధ్య చర్చిలు దగదగా మెరిసిపోతున్నాయి. గ్రామాల్లో క్రిస్మస్ పండుగ వాతావరణం ఏర్పడింది.

ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బంగి రంగారావు

గద్వాల న్యూటౌన్: అపరిష్కృతంగా ఉన్న ఎల్‌ఐసీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని ఐసీఈయూ గద్వాల బ్రాంచ్ కార్యదర్శి బంగి రంగారావు డిమాండ్ చేశారు. ఎఫ్‌ఓ ఎల్‌ఐసీ, క్లాస్‌వన్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఎన్‌ఎఫ్‌ఐ ఎఫ్‌డబ్ల్యూఐ, ఏఐఈఎం అసోసియేషన్, ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్లు సంయుక్తంగా బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గద్వాల ఎల్‌ఐసీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల వేతన సవరణకు సంప్రదించిన సంప్రదింపులు వెంటనే చేపట్టాలని మేనేజ్‌మెంట్‌ను డిమాండ్ చేశారు. ఎల్‌ఐసీ సంస్థలో ఉన్నటువంటి అన్ని క్యాడర్లలో తగినన్ని ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. నూతన పెన్షన్ విధానంలో ప్రస్తుతం 10శాతం మేనేజ్‌మెంట్ కాంట్రిబూషన్‌ను 14 శాతానికి పెంచాలన్నారు. ఉద్యోగులు, అధికారుల సమస్యలపై యాజమాన్యపు ఏకపక్ష నిర్ణయాలు సరైనవి కావని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన డిమాండ్లను పరిష్కరించి, సానుకూల వాతావరణం కల్పిస్తే సంస్థ బలోపేతం కావడానికి శక్తివంచన లేకుండా ఉద్యోగులు కృషి చేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో క్లాస్‌వన్ ఆఫీసర్స్ ఏపీ రాజేందర్, బషీర్, విజయలక్ష్మి, ఉద్యోగులు పద్మావతి, సూరజ్, రాజేందర్‌కుమార్, రాఘవేందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షాబాద్ గ్రామానికి చెందిన దానియేలు అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే విజయుడు బుధవారం షాబాద్‌కు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఆ యా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఓటర్ జాబితాపై బీఎల్‌ఓలకు అవగాహన



జల్లాపురంలో బీఎల్‌ఓల సమావేశంలో అధికారులు



ఉండవెల్లిలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

మానవపాడు: 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జుబెర్ మోహినొద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని జల్లాపురంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బీఎల్‌ఓలు పర్యటించి 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఫారం -6 ఇచ్చి దరఖాస్తు చేయించాలని సూచించారు. 01.01.2024నాటికి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 01.05.2024 నాటికి ఓటరు లిస్ట్ ప్రచురిస్తారని తెలిపారు. ఓటరు జాబితాలో పారదర్శకతను పాటించాలన్నారు.డిప్యూటీ తహసీల్దార్ ధరనిషా, ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి, బీఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎల్‌ఓలకు ఓటరు జాబితాపై తహసీల్దార్ వెంకటరావ్ అవగాహన కల్పించారు. బుధవారం పాఠశాల తరగతి గదిలో ప్రొజెక్టర్‌తో బీఎల్‌ఓలకు ఓటుపై పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో గరుడ్మపె ఎలాంటి సమస్యలున్నాయని తెలుసుకున్నారు. ఓటు హక్కు వినియోగించేలా అందరికి తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కౌలు రైతుల కష్టం తీరేనా?

- సర్కారు సాయం అందక ఇబ్బందులు
- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశాలు
- కౌలు రైతులకు పంటసాయం అందేనా



ఉండవెల్లిలో పంట పొలంలో రైతు

ఉండవెల్లి: కౌలు రైతులు కష్టించి సాగు చేస్తున్నా ప్రతిఫలం దక్కడం లేదు. సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు అందడం లేదు. సర్కారు హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. దీంతో సాగు సమయంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ శాతం పంటలు తీసే కౌలు రైతులకు తగిన గుర్తింపు లేక ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతికే కౌలు రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం అందించే ఏ పథకాలు సైతం పొందలేక ఇబ్బందిపడుతున్నారు. పంట పెట్టుబడి, రుణసాయం, నష్ట పరిహారం ఏ ఒక్కటి వారికి అందడం లేదు. కౌలుకు తీసుకుని సాగు చేసిన పంటలు నష్టానికి గురైతే ప్రభుత్వం నుంచి సాయం పొందలేక దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి కౌలు రైతుకు ఎలాంటి సాయం అందలేదు. భూములున్న రైతులకే రైతుబంధు, రైతుబీమా, తదితర పథకాలు అమలు చేసింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా అండగా నిలుస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

కొత్త ప్రభుత్వమైనా కరుణించేనా?

అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కౌలురైతుకు కాంగ్రెస్ అండగా ఉంటానని భరోసా ఇచ్చింది. తాము అధికారంలోకి రాగానే పెట్టుబడి సాయం కింద ఏడాది రూ.12 వేలు అందిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. ఈ ప్రభుత్వంపై కౌలు రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి 15రోజులవుతున్నా కాంగ్రెస్ హామీపై నేతలు, అధికారులు నోరు మెదపడం లేదు. కౌలు రైతుకు అందిస్తామన్న సాయాన్ని త్వరగా అందించి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

కౌలు ధరలు పిరం..

ఒక ఎకరా కౌలుకు తీసుకోవాలంటే రైతు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నల్లరేగడి భూమికి ఎకరాకు సుమారు రూ.15 వేల నుంచి రూ.18 వేల కౌలు అవుతోంది. బోరు మోటరు కింద భూమి ఎకరాకు రూ.20 వేలకు పైగా చెల్లిస్తున్నారు. ఏటేటా కౌలు ధరలు పెరుగుతున్నాయి. దీనికి తోడు పెట్టుబడి భారమవుతోంది.

అప్పుల ఊబిలోకి..

ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటను ప్రకృతి దెబ్బతిస్తే ఆ నష్టాన్ని భరించే రైతుల బాధ వర్ణ నాతీతం. పెట్టుబడి చేతికి రాక చివరకు కౌలు రైతు అప్పుల పాలై ఆర్థిక ఇబ్బందుల్లో చితికిపోవాల్సిందే. ఒక వేళ పంట చేతికొచ్చిన గిట్టుబాటు ధర లభించక నెత్తికి చేతులు పెట్టాల్సిందే. మండలాల్లోని కౌలు రైతులు పత్తి, మిరప, పంటలు సాగు చేయడంతో ప్రస్తుతం దిగుబడి సగానికి పైగా తగ్గడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయమని వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. భూములు లేకనే కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాం. మాకు ప్రభుత్వ పథకాలు, పంట నష్టపరిహారం మంజూరు చేయాలి.

– పెద్దయ్య, ఉండవెల్లి, కౌలు రైతు

గుర్తింపు కార్డులు ఇవ్వాలి..



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. వాటిపై పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బ్యాంకుల్లో రుణాలు అందించాలి.

– మద్దిలేటి, లింగన్‌వాయి, కౌలు రైతు, అలంపూర్

నిబంధల ప్రకారమే..



ప్రభుత్వ నింబంధల ప్రకారమే పట్టాదారులకు పెట్టుబడి సాయం మంజూరు చేస్తున్నాం. వారికి బీమా అందుతుంది. కౌలు రైతులకు సాయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మార్గదర్శకాలు అందాల్సి ఉన్నాయి.

– గోవింద్ నాయక్, డీఏఓ

టార్పాలిన్లు అందించండి



కేటీదొడ్డిలో ధాన్యంపై కప్పిన బస్తాలతో కుట్టిన కవర్లు


- వర్షమొస్తే తడుస్తున్న ధాన్యం
- ఐదేళ్లుగా నిలిచిన టార్పాలిన్ల పంపిణీ
- పథకాన్ని పునరుద్ధరించాలని రైతుల వేడుకోలు

కేటీదొడ్డి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కప్పేందుకు టార్పాలీన్లు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఐదేళ్ల క్రితం వరకు రైతులకు టార్పాలీన్లు సరఫరా చేసింది. దీంతో అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంతో పాటు తమ సొంత కల్లాల్లో ఆరబోసుకున్న ధాన్యంపై వర్షం పడకుండా కప్పుకునేవారు. అయితే ఐదేళ్ల నుంచి ప్రభుత్వం టార్పాలీన్లు పంపిణీ చేయడమే మరిచిపోయింది.

అధిక ధరకు కొనుగోలు..

కేటీదొడ్డి మండల వ్యాప్తంగా దాదాపు 12 వేల మంది రైతులు ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి 13,706 ఎకరాల్లో వరిసాగు చేశారు. వీరంతా ప్రతి ఏటా టార్పాలీన్ల కోసం ఎదురుచూస్తుంటారు. ప్రభుత్వం గతంలో 50 శాతం సబ్సిడీ టార్పాలీన్లు పంపిణీ చేసేది, 2019 నుంచి పంపిణీ నిలిపివేసింది. దీంతో రైతులు రూ.3 వేల పైగా ధర చెల్లించి బహిరంగ మార్కెట్‌లో టార్పాలీన్లు కొనుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వర్షమొచ్చినప్పుడు రైతులు తమ ధాన్యం తడవకుండా కప్పుకునేందుకు సబ్సిడీపై టార్పాలీన్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే అందించాలి



ఐదేళ్ల నుంచి టార్పాలీన్ల పంపిణీ చేయడం లేదు. ఆకాల వర్షాలప్పుడు ధాన్యం తడిసిపోతుంది. బయట దుకాణాల్లో టార్పాలీన్ల కొనాలంటే ఒక్కోదానికి రూ.3 వేలకు పైగానే చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వమే అందజేయాలి.

– కొండయ్య, రైతు, కేటీదొడ్డి

ప్రభుత్వం అందిస్తే పంపిణీ చేస్తాం

గతంలో సబ్సిడీ ద్వారా అందించిన టార్పాలీన్ల పంపిణీ చేశాం. 2019 నుంచి పంపిణీని ప్రభుత్వం నిలిపేసింది. దీంతో రైతులు టార్పాలిన్లు అందించలేకపోతున్నాం. ప్రభుత్వం నుంచి వస్తే రైతులకు టార్పాలీన్లు పంపిణీ చేస్తాం.

– మహాలక్ష్మి, ఏఓ, కేటీదొడ్డి

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



బోధనపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

మానవపాడు: విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని ఆయా పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న పాఠ్యాంశాలను విద్యార్థులకు చదివించి, విషయ పరిజ్ఞానం పెంపొందించుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని, విద్యార్థులకు బోధనలో మెలకువలు నేర్పాలన్నారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయలు బోధనపై మాట్లాడి సలహాల, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీపనగండ్ల విద్యార్థికి గోల్డ్ మెడల్

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన విద్యార్థి శశేంద్ర ఇటీవల రాష్ట్ర స్థాయి అండర్–19 రెజ్లింగ్ పోటీల్లో గెల్డ్ మెడల్ సాధించారు. మదుగని రాముడు, పెద్దలక్ష్మి దంపతుల కుమారుడు శశేంద్ర యాదాద్రి భువనగిరి జిల్లా టీఎస్ఆర్‌జేటీ గురుకుల పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 18 నుంచి రెండు రోజులు హైదరాబాద్‌లోని జియాగూడలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించి, ఈ నెల 24 నుంచి జరగనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు.

'క్రాప్ హాలిడే'కు సహకరించాలి

వీపనగండ్ల: ఉన్నతాధికారులు ఆదేశానుసారం జూరాల కాల్వ కింద క్రాప్ హాలీ డేను ప్రకటించామని, రైతులు యాసంగి సీజన్‌లో పంటలు సాగుచేయకుండా సహకరించాలని మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

బహుమతుల ప్రదానం



కేటీదొడ్డి: మండలంలోని సోంపురం గ్రామంలోని శ్రీమారెమ్మ జాతర సందర్భంగా బుధవారం సర్పంచు తిక్కన్న ఆధ్వర్యంలోని సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొదటి బహుమతి నాగన్‌దొడ్డి ప్రతాప్, రూ.10,016, రెండో బహుమతి గుడుబలురు సురేష్, రూ.5,016, మూడో బహుమతి తింగన్‌కాన్‌దొడ్డి వీరేష్, రూ.3,016 నాల్గో బహుమతి మిట్టదొడ్డి ఉరుకుందు గెలుపొందగా వారికి వారి సర్పంచ్ తిక్కన చేతుల మీదుగా బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: పిండి గిర్ని విషయంలో గొడవపడిన ఇరువర్గాలపై కేసు నమోదైన సంఘటన కోదండాపురం పీఎస్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవా కథనం మేరకు.. మండలంలోని ధర్మవరంలో బ్రహ్మేశ్వర్ నాయుడు, వడ్లస్వామి కుటుంబాల మధ్య మంగళవారం రాత్రి పిండి గిర్ని విషయంలో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఆయా కుటుంబాల ఫిర్యాదు మేరకు శ్రీహరి, బజారి, వెంకటపతినాయుడు, వడ్ల పెద్దస్వామి, వడ్ల సుజాత, తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

మల్దకల్: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23న ఎంపీపీ రాజారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

అయిజ: మండలంలోని వెంకటాపురంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని స్థానిక నాయకులు ప్రారంభించారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, అందుకు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



అయిజ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థి పరశురాముడును బుధవారం బీజీఆర్ పాఠశాల యాజమాన్యం శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బాల వెంకటరెడ్డి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లిలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి 67వ ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో బీజీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థి పరశురాముడు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు రికవరీ



మానవపాడు: చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. మండలంలోని రెండు ఫోన్లను ఎస్ఐ రాము ఆధ్వర్యంలో పోలీసులు రికవరీ చేశారు. చంద్‌బాషాకు చెందిన 1ప్లస్ మొబైల్ (రూ.35వేలు) ఫోన్‌ను ఆగస్టులో పోగొట్టుకున్నాడు. అదే నెల సెల్ ఫోన్ మిస్సైనట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పోలీసులు ఫోన్ పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన మరోక వివో ఫోన్‌ను(రూ. 25వేలు) సైతం పోలీస్‌లు రికవరీ చేశారు. రెండు మొబైల్స్ విలువ దాదాపు రూ. 60వేల దాకా ఉంటుంది. మొబైల్ ఫోన్లు తిరిగి పొందడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

ఆత్మకూర్: క్షణికావేషానికి లోనై వివిధ కేసుల్లో ఉన్నవారు ఈనెల 30వ తేదీన ఆత్మకూర్‌లోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ నరేందర్ అన్నారు. మండలంలోని గ్రామాలకు చెందిన కక్షిదారులు, క్రిమినల్, సివిల్, భూతగాదాలు, చిట్‌ఫండ్, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ కేసులు, కుటుంబ కలహాలు, వివిధ కేసుల్లో ఉన్న వారు రాజీ మార్గమే రాజ మార్గముగా గుర్తించి రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. కక్షిదారులు సంప్రదించాలని కోరారు.